# చిలకమర్తి స్వచ్ఛ భారత్

"యత్ర స్వచ్ఛ : తత్ర లక్ష్మీ :" ఎక్కడయితే స్వచ్ఛత అనగా శుభ్రత ఉండునో అక్కడే లక్ష్మీ దేవి నివసించును. మన యొక్క వేదములలో మరియు శాస్త్రములలో స్వచ్ఛతకు చాలా ప్రాధాన్యత తెలిపినారు. మన పురాణాలలో మరియు ఇతిహాసాలలో స్వచ్ఛతకు మన పూర్వీకులు ప్రాధన్యత నివ్వడం గమనించవచ్చు. ముఖ్యముగా మన సనాతన ధర్మములో పండగల యందు, వివాహాది షోడశ కర్మల యందు మన పూర్వీకులు మరియు మన మహర్షులు స్వచ్ఛతకు ప్రాధన్యతనిచ్చినారు. భారతీయులు వాస్తు శాస్త్రమందు మరియు ఆయుర్వేదమందు స్వచ్ఛతకు ప్రాధాన్యత తెలిపినారు. ఇదే కాకుండా మనకు ఎక్కడో భూమికి దూరంగా సంభవించేటువంటి గ్రహణ సమయములలో, గ్రహణముల వలన మన యొక్క పరిసర వాతావరణములలో మార్పు సంభవించునని వాటి వలన ఎన్నో అనారోగ్య సమస్యలు ఏర్పడునని తెలిపిన మన పూర్వీకులు ఆగ్రహణ సమయం తరువాత ఇంటి మరియు పరిసర ప్రాంతములను శుభ్రపరచటం ప్రతి ఒక్కరికి తెలిసిన విషయం. దీనిని బట్టి గమనించగా భారతీయుల రక్తములో స్వచ్ఛత అనేది ఉన్నది. అయితే కలియుగములో ముఖ్యముగా మన యువతలో కొంతకాలముగా నేటి ఆధునికత వలన మరియు ఉద్యోగరీత్యా కూడా స్వచ్ఛత యొక్క ప్రాధాన్యత తగ్గుముఖం పట్టడం జరిగింది. దీనిని పునర్నిర్మించడం కొరకై మన భారత దేశ ప్రధాని అయినటువంటి శ్రీ నరేంద్రమోదీ స్వచ్ఛ భారత్ అనే అంశాన్ని ప్రారంభిచడం నేను ఒక శుభపరిణాముగా భావించుచున్నాను. అందువలన స్వచ్ఛ భారత్ యొక్క కృషిలో నా వంతు పాత్రగా నా పాఠకులకు నా పుస్తకముల ద్వారా స్వచ్ఛ భారత్ యొక్క ప్రాధన్యతను తెలియజేయుచున్నాను. దీనిలో ప్రతి ఒక్కరు వారి యొక్క పాత్ర వారు పోషించవలసిందిగా కోరుచున్నాను.

**2015-16** శ్రీ మన్మథ నామ సంవత్సరము నందు నా పాఠకులందరు స్వచ్ఛగోదావరి పుష్కరాలు చేయవలసినదిగా కోరుచున్నాను. స్వచ్ఛ గోదావరి పుష్కరాలనగా మీరు వెళ్ళి గోదావరి నదిని శుభ్రం చేయనక్కర్లేదు. కాని, గోదావరి నదికి పుష్కరాలు జరిగే సమయములో యీ క్రింది విషయములను ప్రతి ఒక్కరు పాటించినచో వారు స్వచ్ఛ గోదావరి పుష్కరాలను చేసినవారగదురు.

## స్వచ్ఛ గోదావరి పుష్కరాలకు పాటించవలసిన విషయములు :

1. **పుష్కర స్నానం** – పుష్కరాలలో అత్యంత ప్రాధాన్యతతో కూడదగిన అంశం పుష్కరస్నానం. ఈ పుష్కర స్నానమందు ప్రతి ఒక్కరు గోదావరి నదియందు స్నానమాచరించవలెను. పుష్కరాలలో పుష్కర స్నానమందు పితృదేవతలను మరియు దేవతలను స్మరించి వారికి అర్ఘ్యములు విడిచి పెటువంటి గొప్ప సమయము. మీరు స్నానమాచరించనప్పుడు పసుపు, గంధం, నదీప్రవాహం క్రింద నున్న మట్టితో లేదా వేపాకులతో మాత్రమే పుష్కర స్నానం చేయవలెను. ఇలా చేసే స్నానం ఆరోగ్యకరం మరియు శాస్త్ర సమ్మతి. అంతేకాని కేవలం సబ్బు మరియు షాంపూలతో స్నానం చేయడం పుష్కర స్నానం కాదు.
2. పుష్కరస్నానాతరం అక్కడ గోదావరి నదిలో బట్టలు ఉతకవద్దు.
3. పూజాది కార్యక్రమములలో మిగిలిపోయిన వస్తువులను చెత్త బట్టలలో మాత్రమే పారవెయ్యండి.
4. దీపాలను నదిలో విడిచి పెట్టేటప్పుడు అరిటాకులలో ముఖ్యముగా బియ్యపిండితో చేసిన దీపాలను మాత్రమే విడిచిపెట్టవలెను. కొబ్బరి చిప్పలలో దీపాలు వదలరాదు. బియ్యపుపిండి ప్రమిద ఆనది లోని జీవరాశులకు ఆహారముగా ఉపయోగపడును.
5. పుష్కర స్నానమందు నదిలో మలమూత్ర విసర్జన మహాపాపము.

పైన చెప్పిన విషయములను పాటించుట వలన గోదావరి నది కాలుష్యానికి లోనవదు. గోదావరి నదిని కాలుష్యరహితముగా చేసి మన తరతరాల వారందరికీ స్వచ్ఛ గోదావరిని అందజేయాలని, మరియు యీ మన్మథనామ సంవత్సర మందు స్వచ్ఛగోదావరిని పాటించవలసిందిగా కోరుకుంటూ. . . . . .

మీ

సుధీజన విధేయుడు

**చిలకమర్తి ప్రభాకర చక్రవర్తి శర్మ**

**www.chilakamarthi.com**